పతనం అంచున

శ్రీ జి. భాను

హృదయంలో మూగగా కదులుతున్న ప్రేమలా ప్రవహిస్తున్న కాలువలోని చిరుతరంగాలమీద పడిన ఎలక్ట్రిక్ దీపపుకాంతి దీర్ఘమైన కాంతి లతను ఏర్పరుస్తున్నది.

కాలవగట్టుమీద నల్లని నీడ దుప్పటి కప్పుకొని పిట్టల మూలుగులలో స్తబ్ధంగా ఉన్నచెట్టు గుండెలో దిగులున్నప్పటికీ మౌనం వహించిన వ్యక్తిలా ఉన్నది.

నెమ్మదిగాఉన్న మనసును మథనపెట్టే కత్తి వంటి ఆలోచనలా నిశ్శబ్దంగా ప్రవహిస్తున్న కాలువలో ఏదో చేప తళుక్కుమని ఎగిరి మరలా నీళ్ళలో పడింది.

వరండామీద నుంచొని పై పరిసరాన్ని గమనిస్తున్న భాగ్యం మనసులో ఏవేవో అనుభవాలు కలుక్కుమన్నాయి. ఉవ్వెత్తుగా విరుచుకుపడే భావాల తీవ్రతకు కన్నులు మూసుకొన్నది.

పరిమళాలు గాలికి దానం చేస్తున్న ప్రక్కన ఉన్న పొన్నచెట్టు మీదగల పక్షుల కంఠాల్లో దైన్యం కదలాడింది. అవి ఏ శిథిల జీవితానికి అపశ్రుతుల స్పర్శో!

కలలో ఉలిక్కిపడిన పసిపాపల్లాగ ముద్దబంతి పూలు ఆమెనుచూచే కాబోలు తలలూగించాయి! అవి ఏ భావి భాగ్యోదయానికి సూచకాలో !

భాగ్యం కన్నులు తెరిచింది. మనసునకు తాత్కాలిక ఉపశాంతి కల్గించిన రెండు కన్నీటిబొట్లు మెల్లగా జారిపడ్డాయి. అంతలో 'అక్కా!' అనికేక విన్పించింది. లోనికి వెళ్ళింది భాగ్యం. మంచంపై పదహారు సంవత్సరాల పిల్ల ఆవలిస్తూ కూర్చున్నది. అందమైన ముఖంమీద అల్లిబిల్లిగా జుట్టుపడి ఒక క్రొత్త అందాన్ని కల్గించింది. విశాలమైన కన్నుల్లో నిద్రాదేవి లాస్యం కనబడుతున్నది. భాగ్యం చెల్లెలి ప్రక్కన కూర్చున్నది.

'ఏ...మ్మా...భారతీ! నిద్రపట్టడం లేదా?' తల నిమురుతూ అడిగింది.

'కొత్తగా ఉందక్కా ఇల్లు...నిద్రసరిగా రావడం లేదు' ఆవలించి అక్క భుజంపైన తలపెట్టింది.

'కొత్తదనానికికూడా...అలవాటు పడాలమ్మా! సర్దుకు పోవాలి...ఎలాగో నిద్రపోవాలి...నా తల్లివి కదూ...నిద్రపో.' వీపు నిమిరింది.

'నువ్వుకూడా నిద్రపో మరి'.

'ఎందుకు నిద్రపోనూ? నీకులా...నిద్ర తొందరగా ఎలాపడుతుందమ్మా నాకు? అయినా నాకు తొందరగా నిద్రపడితే నిద్రకే నామర్దా'— చిన్నగా నవ్వింది.

'పో అక్కా! నువెప్పుడూ ఇంతే. మరీ బయిటికెందుకు వెళ్ళావ్?'

'బయిటికా? ప్రకృతి ఏమైనా మనస్సుకు ఉపశాంతి ఇస్తుందేమోనని ఆశ! అదీ లేకపోతే జీవితం ఎంత భారం! నీకెందుకమ్మా ఈ ప్రశ్నలు? నువ్వు నిద్రపో'.

'కొత్తింటిలో ఎలా నిద్రపడుతుందమ్మా... ఎందుకు కొత్తిల్లు మార్చింది?'

'క్రొత్తగా ఉండాలనే భారతీ! నిద్రపో ఇక... నా ముద్దుల చెల్లెలివికదూ! నా వరాలతల్లివి కదూ'. లాలనగా అంది.

'నీ ముద్దుల చెల్లి రాబోతుందిగా. నే నెందుకౌతాను.?'. బుంగమూతి పెట్టింది.

'భారతీ! ఈ మాట చిన్నక్క వింటే ఊరు కొంటుందా? దానికి నువ్వంటే ఎంత ముద్దు! నేనంటే ఎంత గౌరవం! రేపన్నా వస్తారో లేదో? ఈ రోజు వస్తామన్నారు. రాలేదు. అసలే ఈ బండ్లు ఆలస్యంగా వస్తున్నాయి. దారిచూసి కళ్లుకాయలు కాస్తున్నాయి. మూడు సంవత్సరాలైంది చూసి; ఎలా ఉందో నా చెల్లెలు! ఎలాగైనా దాని బెడద తీరిపోయింది. ఏదో కొంతవరకు చదివించాను; ఒక యింటిదాన్ని చేశాను. ఇక నువ్వున్నావు. నిన్నొక అయ్యచేతిలో పెడితే...నా జీవిత లక్ష్యమే సంపూర్తి అవుతుంది... తర్వాత నా బ్రదుకు ఏమైనా ఫర్వాలేదు'. నిట్టూర్పు విడిచింది.

అప్పుడే దగ్గరలో ఏదో పిట్ట భయానకంగా అరచింది. భారతి అక్కను భయంతో కౌగలించుకొన్నది.

'పిట్ట కూతలకే ఉలిక్కిపడితే జీవితంలో ఏం సాధిస్తావమ్మా నిద్రపో. నేను దుప్పటి కప్పుతాను. వెచ్చగా పండుకొని, ప్రొద్దున్నే లేవాలి. చిన్నక్క, బావ తప్పక వస్తారనే అనుకొంటున్నాను' అని ఆప్యాయంగా నుదురుమీద ముద్దుపెట్టుకొని, ప్రక్కన ఉన్నమంచంపై కూర్చున్నది.

ఆలోచనా తరంగాలు మనసుమీద విరుచుకు పడుతున్నాయ్. గత జీవితాన్ని సింహావలోకనం చేసుకుంటే ఒళ్లు గగుర్పొడుస్తున్నది. కానీ గత్యంతరం లేని పరిస్థితులు, పరిస్థితులంపైన పెత్తనం వహించిన లోకం, మనసులోని మమతల సంరక్షణం— ఇవన్నీ తన జీవితాన్ని చీకటి గుయ్యారంగా చేశాయి. గాఢతిమిరంలో బీద చుక్కల వెలుతురే పెన్నిధిలాగా తలచిన తనకు వ్యధలేమిటి? రెండు కన్నులైన చెల్లెళ్ల సుఖమే ధ్యేయంగా తలచిన తాను లోకాన్ని చూడలేదు. మనసులో ఓమూల మచ్చ హెచ్చరించినా— 'లక్ష్యం మంచిదైనపుడు, ఏం చేసినప్పటికీ, దైవం కొంతవరకు క్షమించక పోదు' అనే ఊరడింపు హృదయానికి జోలపాడింది.

ఆ నాడూ, ఈ నాడు ఇవే ఆలోచనలలో సతమతమైన భాగ్యం చివరకు నిద్రాదేవి అదృశ్య హస్తాల్లో కన్నులు మూసుకొన్నది.

తాలూకాలో మూడు గంటలు కొట్టారు.

* * *

తూర్పుదిక్కు కుంకుమ పులుముకొన్నది. పండి, భారంగా, మగతగా ఒరిగిన వరిచేలమీద దూబరలు మందలు మందలుగా పచారుచేస్తూ గోల చేస్తున్నవి. కాలువలోని నీళ్లు పొగలు కక్కుతున్నవి.

పాలవాని కేకవిని, నిద్రలేచిన భాగ్యం వెంటనే పొయ్యి ముట్టించింది. చెల్లెలు, మరది ఇంకా రాలేదే అన్న ఆలోచన మనసులో సుళ్లు తిరుగుతున్నది. ఇంటి ముందునుండి రిక్షాలువస్తూ, పోతున్నవి. ఆశగా చూస్తున్నది భాగ్యం. కొద్దిసేపైన తర్వాత ఒక రిక్షా యింటిముందు ఆగింది. రిక్షాలోనుండి దిగిన ఆడమనిషి, మగమనిషి ఇంటిలోనికి దృష్టి సారించారు. పట్టరాని ఆనందంలో భాగ్యంవెళ్ళి 'సత్యా' అని గట్టిగా కౌగలించుకొన్నది. భాగ్యం కన్నుల్లోనుండి ఆనంద బాష్పాలు జాలువారాయి. 'అక్కా!' అని సత్యవతి భాగ్యం సందిటిలో కరిగిపోయింది. ఈ సంరంభానికి నిద్రనుండి భారతి లేచివచ్చి 'చిన్నక్కా' అనగానే భాగ్యం కౌగిలినుండి విడిపోయి, సత్యవతి, భారతిని ఎంతో ఆప్యాయంగా దగ్గరకు తీసుకొన్నది. రిక్షావాడు – పెట్టె, బెడ్డింగ్ వరండాలో ఉంచి వెళ్ళాడు.

'ఏం బావా! బాగున్నావా?'. భారతి సిగ్గుతో పరామర్శించింది.

'ఎవరూ? భారతిగారా! ఇప్పుడు జ్ఞాపకానికి వచ్చామన్న మాట. ఓ...బాగా ఉన్నాం...అయినా మనలో చెడిపోయే పదార్థం ఏముంది చెప్పు ?'. కృష్ణారావు నవ్వుతూ అన్నాడు.

'మీ మాటలకేంగాని లోపలికి పదండి... మంచు కురుస్తున్నది.' సత్యవతి అన్నది.

'మొక్క మొలవ్వులే నువ్వు' అని ఇంట్లోకి దారితీశాడు కృష్ణారావు.

భారతి బావగారి మాటలకు సంతోషించింది.

భారతిని వెంటబెట్టుకొని సత్యవతి ఇల్లంతా కలయ జూస్తున్నది.

'ఏమండీ! మీ ఆరోగ్యం ఎలా ఉంది? అది వరకటికన్నా తగ్గినట్లున్నారు?'. కృష్ణారావు కుర్చీలో కూర్చుని భాగ్యాన్ని ప్రశ్నించాడు.

భాగ్యం గుండె క్షణం ఆగింది. హృదయంపై ఏదో కల్పితభారం కలుక్కుమంది. ముఖంలోకి మనసులోని వ్యాకులభావం కనబడనీయకుండా 'ఫర్వాలేదు' అన్నది.

అంతలోనే సత్యవతి, భారతితో అక్కడకు వచ్చింది. భాగ్యం కాఫీ తేవడానికి వెళ్ళింది.

'అప్పుడున్న ఇంటికన్న బాగుందనుకొంటాను... ఆ యిల్లు స్టేషన్‌కు కొంచెం దగ్గరనుకొంటాను. ఇది కొంచెం దూరం... మొత్తానికి ఇక్కడ ప్రశాంతంగా ఉంది...తలనొప్పిగా ఉన్నదన్నావ్...ఎలా ఉంది?' అని భార్యను అడిగి 'ఏం భారతి! బాగా చదువుతున్నావా? గుంటూరులోగదూ? కాన్వెంటులోవుండి చదువుతున్నావా? గుడ్! ఎన్నిరోజులు సెలవులు?' అని అడిగాడు. భారతి సమాధానం చెప్పేలోగా కాఫీతో భాగ్యం వచ్చింది.

కృష్ణారావు కాఫీ త్రాగి 'దివ్యంగా ఉంది' అని భార్యవంక చూశాడు.

'నాకు ఇట్లా చేతకాదని అక్కా దీని అర్థం... మంచి కాఫీ...మంచి కాఫీ అని ఒకటే గోల' అన్నది సత్యవతి భర్తవైపు చురచుర చూస్తూ.

'నేనన్నానా ఆ మాట? నీ చేతగానితనాన్ని వెల్లడించుకుంటున్నావుగాని...'

'సరే...లెద్దురూ...నా చేతైనట్లు చేస్తున్నాను...' అని మూతి ముడుచుకొన్నది.

'దానికేంలే అమ్మా! కాఫీ బాగా చేయలేకపోవడం ఒక్కటే చేతకానితనం కాదు...లే, స్నానం చేయడానికి...ప్రయాణం బడలికవల్ల నలిగిపోయారు' అన్నది భాగ్యం సత్యవతిని కన్నారా చూస్తూ.

సత్యవతి అక్కవెంట వెళ్ళింది. భారతి కృష్ణారావు దగ్గర కూర్చున్నది.

'ఏం భారతి! ఏమిటి విశేషాలు! అరరే...అంత సిగ్గయితే ఎలా? గుంటూరు బాగుంటుందా? ఈ వూరు బాగుంటుందా? అయినా ఒక్కదానివి ఇక్కడ ఏం బాగుంటుందిలే? స్నేహితులు వుంటేగదా ఎక్కడైనా ఉషారుగా ఉండడానికి...సరేగాని మద్రాసు ఇంతవరకు చూడలేదు కదూ? ఎన్నిసార్లు రమ్మన్నా మీరు రాలేదు... ఈ సారి మాతో...రండి... బ్రహ్మాండమైన బిల్డింగ్స్...పెద్ద పెద్ద రోడ్లు... కార్లు... మ్యూజియం...జూ, సముద్రతీరం...ఒకటేమిటి...అంతా దివ్యంగా ఉంటుందనుకో!'

'అక్కడ సినిమా స్టుడియోలు ఉంటాయి కదూ? వెళ్లవచ్చా అక్కడికి'. మెరుస్తున్న కళ్ళతో అడిగింది.

'ఓ యథేచ్ఛగా వెళ్లవచ్చు మనం. డైరెక్టరు తెలిసిన నా స్నేహితుడొకడున్నాడు. ఎప్పుడూ 'వెళ్దాం రారా' అంటాడు. ఎన్నిసార్లు చూడను! చెప్పు'

'నన్ను ఇక్కడే జాయిన్ కమ్మంటున్నది అక్క. దగ్గర ఎవరూ లేకపోతే మనసు బాగుండలేదట...మరి మద్రాసు చూడడం వీలు అవుతుందా?'. నిరాశగా అంది.

'నేను మీ అక్కకు చెబుతానులే భారతీ!... మీయిద్దర్నీ రమ్మంటున్నానుగా...సమస్య ఏముంటుంది? ఎన్నిసార్లు రమ్మని రాసినా ఈ వూరు తప్ప, ఇంకో వూరు పడదు అని మీ అక్క ఉత్తరం వ్రాసింది. ఈ సారి తప్పకుండా మిమ్మల్ని తీసుకువెడతానుగా... ఇక్కడ సినిమాలున్నాయా...మంచివి...' అనగానే సత్యవతి గొంతు విన్పించింది. 'అమ్మా! భారతీ! మీ బావగార్ని స్నానానికి రమ్మను' అని.

స్నానాలు, భోజనాలు అయిన తర్వాత మేను వాల్చి లేవగానే సాయంత్రం మూడైంది. చల్లని గాలులు ప్రారంభం అయినాయి. సూర్యరశ్మిలో తీవ్రత తగ్గింది. కృష్ణారావు లేచి ముఖం కడుక్కొని రాగానే కాఫీ, టిఫెన్ రెడిగా ఉన్నాయి. కాఫీ త్రాగి వరండాలోనికి రాగానే సత్యవతి భారతికి తల దువ్వుతున్నది.

'అలంకరణ పొగుతున్నట్లుంది! త్వరగా కానీ యాలి...ఈ కాలువగట్టు దృశ్యం బాగున్నట్లుంది. షికారు పోదాం' అని సమాధానంకోసం ఆగకుండా బట్టలు మార్చుకోడానికి ఇంట్లోకి వెళ్లాడు కృష్ణా రావు సిద్ధం అయ్యేటప్పటికి సత్యవతి, భారతికూడా సిద్ధం అయ్యారు. బయలుదేరారు. 'తొందరగా రండమ్మా' అని లోపలనుండి భాగ్యంకేక వేసింది. 'అలాగే' అని సమాధానం ఇచ్చారు.

దూరంగా ఎక్కడో పొలాల్లో కాపలాకోసం వేసుకొన్న గుడిసెలలోనుండి నెమ్మదిగా పొగ వాతావరణంలో కలియలేక కలుస్తున్నది. పండి, బరువులో ఒరిగిన వరిపొలాలు పరవశంతో వవ్వాళించిఉంటే ఆనందంలో దేవతలు చల్లిన తెల్లని పూవుల్లాగా ఉన్నాయి ఎగురుతూ కొంగలు.

ఈ పరిసరాల్ని పరిశీలిస్తూ మూడు నాల్గు ఫర్లాంగులు నడిచారు, వెళ్లి పచ్చికపైన కూర్చున్నారు. భారతి కొంచెందూరంగా వెళ్లి రకరకాల పూలూ కోసి రాశి పోస్తున్నది.

'సత్యా! సాధారణంగా నగరాల్లో ఇంత సహజమైన హాయి ఉంటుందా? అక్కడ జనసమూహపు కోలాహలమే విశేషంకాని ఇంత సజీవమైన ప్రకృతి కనబడదు. మగువలా వంపులు హొయలు చిలికిస్తూ పొగిపోతున్న కాలువ, మగువ నడకలు చూచి తల లూగిస్తున్న మగనారిలాగా తుంగపూల త్రుళ్లింత, ఈ సంరంభాన్ని చూసే ధ్వని చేస్తున్నట్లు, రక రకాల పిట్టల అరుపులు, వీటన్నిటికన్న మనస్సుకు తృప్తినిచ్చే పంటచేల కమనీయదృశ్యం, ఎంత బాగుంది ఇక్కడ? మనముండే పదిరోజుల్లో రోజూ వద్దాం. ఏమంటావు?'. భార్య ముఖంవైపు చూశాడు.

'సరే' అంది సత్యవతి ఏమిటో ఆలోచిస్తూ.

'ఏమిటో ఆలోచిస్తున్నావ్'. నెమ్మదిగాఅంటూ, ఆలోచనా భంగిమలోఉన్న అర్ధాంగిని ముద్దు పెట్టుకో బోయాడు.

'ఉష్...భారతి' కళ్లతో సైగ చేసింది. మామూలుగా కూర్చున్నాడు కృష్ణారావు.

'భారతిని మనతోబాటు తీసుకు పోదామండీ. నాకు తోడుగా ఉంటుంది. మీ రేమంటారోనని ఆలోచిస్తున్నాను.'

'ఊఁ...ఇఁకా...'

'ఇంకా లేదు...ఏమీలేదు...మీరేమంటారు?,

'నీ ఇష్టం కాదంటానా? కాని మీ అక్క ఒకర్తే అవుతుంది గదా అని...'

'అయి...తే...'

'ఒకటి: మీ అక్క ఒప్పుకోవాలి. రెండు: భారతిని ఇక్కడే చదువుకోమంటున్నదట. మూడు–మీ అక్క ఆరోగ్యం సరిగాలేదు. కబట్టి ఈ కారణాలనుబట్టి అసలు మనతో పంపుతుందా? పంపినా పై కారణాల్నిబట్టే ఏం బాగుంటుందీ? అని...'

'ఏం మునిగిపోదులెండి!'. మాటల్లో పరుషత్వం ధ్వనించింది.

భార్యవైపు సాశ్చర్యంగా చూశాడు. ఆమె కన్నుల్లో ఏవోఏవో భావాలు కనబడ్డాయి. ఆ భావాల వెనకాల ఏదో రూపం ఉంటుందని కృష్ణారావు అనుకున్నాడు. మౌనం వహించాడు.

'ఈ రోజు స్టేషన్‌దగ్గర ఏవడో రిక్షావాడు ఇంటిగుర్తు చెప్పగానే ఒకవిధంగా మాట్లాడాడు కదూ...నాకెంత నామోషీ అయిందనుకొన్నారు... మొత్తంమీద నాకేమిటో అనుమానంగా ఉందండి' భర్త కన్నుల్లోకి చూచినది.

'ఆఁ...మనసు స్థిమితంగా లేనపుడు ఏ మాటలు విన్నా ఏదో వ్యంగ్యార్థం స్ఫురిస్తుంది. అది మనసు ప్రభావం. ప్రయాణపు బడలికలో ఎవడో, ఏదో కూశాడని అపార్థాలు కల్పించుకోడం తొందరపాటు. మీ అక్కను గురించిన చెడువిషయం ఎందుకో నేను నమ్మలేను. ఎందుకంటే మన పెళ్లి సంఘటన జ్ఞాపకంవస్తే ఈ విషయాలు పరిగణనకే రావు. ఈ సంగతి నేను అదివరకే చెప్పాను. మళ్లా చెబుతున్నాను. నేను ముందు మీ అక్కనే పెండ్లి చేసుకొందామనుకొన్నాను. కాని మీ అక్క అంగీకరించ

లేదు. 'నాకు టి. బి. లక్షణా లున్నాయ్. నన్ను చేసుకోడంవల్ల ప్రయోజనంలేదు. నా జీవితం ఇక ఇంతే. కాని నాకు ఇద్దరు చెల్లెళ్లున్నారు. వాళ్లే నా ప్రాణం. వాళ్లలో పెద్దపిల్లను చేసుకోండి...నా జీవితాంతం మిమ్మల్ని పూజిస్తాను' అని ఎంతో దయనీయంగా ప్రాధేయపడింది. అప్పుడు నాకు నిజంగా మనసు కరిగిపోయింది. స్వార్థాన్ని త్యాగం చేసుకొనేవాళ్లూ, ఆనందాన్ని ఆహుతి చేసుకొనేవాళ్లూ ఇంకా లోకంలో ఉన్నారనిపించింది. తర్వాత నిన్ను చూశాను. అది వేరే సంగతి. కానీ అప్పటినుండి మీ అక్క అంటే ఒకవిధమైన గౌరవం నాకు. ఎన్నోవిషయాలు, ఆలోచించగల్గినా ఎందుకో మనసు వెనుకంజవేస్తుంది. అందుకనే ఆవిడ విషయం భిన్నంగా ఉన్నదంటే వెంటనే నమ్మలేకపోతున్నాను...అయినా ఎందుకా వృథాఆలోచన నీకు...' అన్నాడు కృష్ణారావు. సత్యవతి కన్నులు తుడుచుకొన్నది.

'భారతీ! బయలుదేరుదామా' అన్నాడు కృష్ణారావు. ముగ్గురు బయలుదేరారు.

హృదయంలో రేగిన అనుమానాల కీలల్లాగా చీకటితెరలు భూమిని ఆక్రమించుకొంటున్నాయి. బాధా నిట్టూర్పుల్లా చలిగాలులు విజృంభించాయి. అన్యాయాన్ని ఆసరా చూచుకొని మిడిసిపడే సమస్యల్లా చుక్కలు నిక్కి చూస్తున్నాయి.

దాదాపు ఇంటివద్దకు వచ్చాక కృష్ణారావు వెనక్కు తగ్గాడు. సత్యవతి, భారతి ఇంటికి వచ్చారు. వరండా ఎక్కబోతుండగా కొన్నిమాటలు విన్పించాయి.

'ఈసారికిమాత్రం ఒప్పుకోండి భాగ్యంగారు! నా మాటా నిలబడుతుంది; మీకు లాభమూ ఉంటుంది. అవతల మనిషి ఎవరో తెలుసుగా?'

'లేదు నరసింహం! నా మనసు ఎప్పుడో మార్చుకున్నాను. అదివరకులా అనుకోవద్దు. అదంతా పీడకల అనుకొంటున్నాను. నువ్వెళ్లిపో. ఎప్పుడూ రావద్దు. నీ కాళ్లు పట్టుకొంటాను. మా వాళ్లు వస్తారు... దయచేసి వెళ్లిపో...'. వ్యాకులంగా విన్పించాయి మాటలు.

'చివరిసారిగా అడుగుతున్నాను...... అంతేనా భాగ్యం!'

'ముమ్మాటికి...అంతే!'

'సరే...వస్తా'నని ఆ మనిషి వరండా మెట్లపైన నిలబడిన భారతిని, సత్యవతిని చూచి ఒక్కక్షణం ఆగి, ఓరచూపుచూసి, ఒకవిధంగా నవ్వి వెళ్లిపోయాడు. సత్యవతి గుండెలో మంట పుట్టింది ఒక్కొక్క రోమకూపం అగ్నిపర్వతం అయ్యింది. ఊహించిన విషయం జరిగితే కలిగే దిగ్భ్రమలాంటిది ఆవరించింది. భారతి సత్యవతిని చూసి భయపడింది కాని పూర్తిగా అర్థం కాలేదు. ఇద్దరు మౌనంగా వరండాలో కుర్చీలపై కూర్చున్నారు. ఏదో ఆందోళన, అసహాయత వాళ్ళ మనసుల్లో ఉంది. అంతలో భాగ్యం వరండాలోనికివచ్చి, చెల్లెళ్ళను చూసి అదిరిపడింది.

'అమ్మా! చీకటిలో కూర్చున్నారా? భారతీ! బావగారేరీ?' మామూలుగా మాట్లాడింది. సత్యవతి అనుకొన్న మార్పు గొంతులో కనిపించలేదు.

'అమ్మా! మాట్లాడవేం' సత్యవతి దగ్గరకు వస్తూ అంది.

'ఏం లేదక్కా...' గద్గదికంగా మాటలు వచ్చాయి.

భాగ్యం సత్యవతి తల నిమురుతూ నుంచుకొన్నది. సత్యవతి హృదయంలో క్రోధ సర్పం బుసలు కొడుతున్నది. నాగస్వరంవంటి అక్క హస్త స్పర్శ దాన్ని ఉపశమింప జేస్తున్నది. అక్కను నిర్దాక్షిణ్యంగా అడిగివేయాలి. ఎవ రతను? ఏమిటీ సంభాషణ? ఏమిటా మాటల అంతరార్థం? అని. కాని ఎలా? తనను వాత్సల్యంగా పెంచిన అక్క! స్వార్థం చూచుకోని అక్క! తనక్షేమం కాక్షించే అక్క! అలా చేస్తుందా? అవినీతిగా ప్రవర్తిస్తుందా? ఇంకేమైన విషయాన్ని గురించి మాట్లాడుతున్నదేమో? అని రకరకాల ఆలోచనలు మనసులో వెలుగునీడలైనాయి.

'బయట బాతాఖానీ వేస్తున్నట్లున్నారే?' అని అప్పుడే వచ్చిన మరిదిమాటవిని భాగ్యంలోనికి వెళ్ళింది. కృష్ణారావు వచ్చి స్విచ్ వేశాడు. ముఖకవళికలలో

మార్పు కనిపెట్టి వెంటనే భార్యవద్దకు వచ్చాడు.

'ఏమిటే...ఇలా ఉన్నావ్' అని కృష్ణారావు భార్య ఫాలభాగంమీద చేయివేశాడు. భర్తచేతిని మృదువుగా స్పృశించింది సత్యవతి చెయ్యి.

సత్యవతికి సరిగా నిద్రపట్టలేదు రాత్రి. భారతికి జరుగుతున్న విషయాలు స్పష్టాస్పష్టంగా అర్థం అవుతున్నాయి. భాగ్యం తన మాటలు, నరసింహం మాటలు చెల్లెళ్లు విన్నారేమోనని లజ్జాభారాలతో క్రుంగిపోయింది. ఆమెకు కలలో పిశాచాలు, వికృతాకారాలు, దేవతాస్వరూపాలు కన్పించాయి. భాగ్యం అపుడు భారతిని నిద్రలో కౌగలించుకొన్నది.

తెల్లవారింది. సత్యవతి ఆలస్యంగా నిద్ర లేచింది. అప్పటికే కృష్ణారావు ముఖం కడుక్కొంటు బయట కూర్చున్నాడు. సత్యవతి ముఖం తుడుచుకొంటూ బయటకు వెళ్లింది. భర్త నవ్వాడు.

'లేచిన వాళ్లు...నన్ను లేపకపోయారూ?' చిరుకోపం ప్రదర్శించింది.

'అవును. వందిమాగధుల్లా స్తోత్ర పాఠం చేయవలసింది. పొరపాటైంది. కాని ఒంట్లో బాగా లేని కారణంచేత నిద్రపట్ట లేదేమోనని...'

'నాకు నిద్రపట్టలేదని తమరికెలా తెలుసు?'

'తమ ముఖారవిందం చూస్తుంటే తెలియడంలా, పూబోణీ!'

'అంతేగదా!' అని భర్తవద్దకువచ్చి కనబడుతున్న పరిసరాల్ని చూచింది.

'చూశారా! కాలువలోని నీళ్లు పొగలు కక్కుతున్నాయి. నిద్రగన్నేరుచెట్టునుండి నీటిబొట్లువర్షం లాగా రాలుతున్నాయి. బంతిపూలు ఎంత బాగా విచ్చాయి. భారతీ! విచ్చిన పూలు కోసుకురా' అని ఉత్సాహంగా మాట్లాడుతున్నది. కృష్ణారావు భార్య ముఖాన్ని చిరునవ్వుతో చూస్తున్నాడు. భారతి పూలు కోస్తున్నది అంతలో భాగ్యం బయటకువచ్చి 'అమ్మా! సత్యా! తొందరగా ముఖం కడుక్కో. కాఫీ చల్లారిపోతుంది' అన్నది.

'ఇదిగో...ఒక్క నిముషం అక్కా!' అన్నది మార్దవంగా. ఆ మాటల్లో ఎటువంటి బాధగాని, వ్యధగాని కన్పించలేదు. భాగ్యం మనసులో అందోళనా కెరటాలు కొంచెం ఉపశమించాయి.

మధ్యాహ్నం భోజనాలైనతర్వాత భారతి, భాగ్యం షాపింగ్‌కు బయలుదేరారు. సత్యవతిని రమ్మన్నారు గాని తలనొప్పిగా ఉన్నదని ఆమె వెళ్లలేదు. కృష్ణారావు ఎవరితోనో మాట్లాడడానికని వెళ్లాడు. సత్యవతికి ఆ ఏకాంతంలో గడచినరోజు ఘట్టం జ్ఞాపకానికి వచ్చింది. అంతకుముందు భర్త చెప్పినమాటలు దివ్యోపదేశంలాగా అనిపించాయి. మనసు మంచి, చెడు భావాల ద్వంద్వాలలో చలిస్తున్నది. అక్క చీకటిలో, అగాధప్రవాహంలో కొట్టుకుపోయినట్లు, ఏవేవో పిచ్చిపిచ్చి ఊహలు కల్గుతున్నాయి. అయినా అక్క 'మారిపోయానంటున్నదికదా?' ఎందుకీ ఆలోచనా ప్రయాస?' అని, ఓదార్పు ఒకవైపునుండి. మొత్తానికి మనసులో రకరకాల భావాల యుద్ధం జరుగుతోంది సత్యవతికి.

అంతలో 'భాగ్యం...గారు' అని పిల్లవాడి గొంతు విన్పించింది. ఉలిక్కిపడి లేచిన సత్యవతి బయటకు రాగానే పదేళ్ల కుర్రవాడు నవ్వాడు. సత్యవతికి ఒళ్లు మండింది. మాట్లాడలేదు. ఆమె మాట్లాడకముందే పిల్లవాడు మాట్లాడాడు.

'మీరేనా భాగ్యం...గారంటే?'

'కాదు...అవును...ఎందుకు? ఏం కావాలి?' కాఠిన్యం మాటల్లో కనబడింది.

ఈ మాటలకు కుర్రవాడు జంకాడు. 'ఆఁ... మరే...మరే...ఇదిగో ఈ ఉత్తరాన్నే...మోహన్‌రావు గారు మీకిమ్మన్నారు...సాయంత్రం పార్కుకాడికి రమ్మన్నారు' అని గబగబచెప్పి ఉత్తరాన్ని ఇచ్చి పరుగెత్తాడు బయటకు.

యాంత్రికంగా ఆ ఉత్తరాన్ని అందుకొన్నది. మనస్సంతా చీకాకైపోయింది. దెబ్బమీదదెబ్బ పడితే ఎలా ఉంటుందో అలా ఉంది ఇటువంటి సంఘటన పైన సంఘటన. ఉత్తరాన్నిగురించి అసంఖ్యాకమైన

ఆలోచనలు కల్గాయి; అంతులేని ప్రశ్నలు ఉదయించాయి.

‘భగవంతుడా! నేను శంకించినట్లు కాకూడదు.. అక్క...అటువంటిది కాకూడదు...కాకూడదు’ మనసులో కోరుకొన్నది. ఉత్తరాన్ని అటు, ఇటు త్రిప్పి చూచింది. మొదట ఏమైనా ఉత్తరాన్ని చదవకూడదనుకొన్నది. కాని దీనిలో ఏముందోననే బలీయమైన చదవాలనే వాంఛను అణచుకోలేకపోయింది. గుండె వేగంగా స్పందించడం మొదలుపెట్టింది. చదవాలనే మానసిక బలహీనత ఇనుమడించింది. గదిలోకి వెళ్ళి తలుపువేసుకొని, వణుకుతున్న చేతులలో ఉత్తరపు మడతలు విప్పుతున్నది. ఆ విప్పడం సత్యవతికి అక్క గుండెల పొరలు విడదీసినట్లుగా ఉంది. మహాపాపం చేస్తున్నాననిపించింది. ఆ ఉత్తరంలో ఇలా ఉంది.

ఒకనాడు గుండెకుదాపై, దూరమైన దయాహీనురాలైన భాగ్యానికి - ఇంకా మరువలేని మోహనరావు.

నన్ను బహుశా మరచిపోయి ఉండవు. అంత మాత్రంచేత నాకు సంతోషం కలుగదు. ఆ నాడు నన్ను తృణీకరించావు. కాదంటే మోసం చేశావు. అందుకే ఈ నాడు పతనం చెందావు. సుందరకేశపాశాల్లో అలంకరింపబడవలసిన కన్నెగులాబి దుమ్ములో, ధూరలో కఠోర పాదాల క్రింద, కసుగంది రేకులు విడిపోయినట్లు నీ జీవితాన్ని ధ్వంసం చేసుకొన్నావు. తప్పు నీదే! ప్రశ్నించుకో హృదయాన్ని.

ఆ నాడు—వర్షం రోజు—అనాథవై ఆక్రోశిస్తున్నప్పుడు, కష్టాల పొలిమేరల్లో తారట్లాడుతున్నపుడు నా మాటలు నీ చెవికెక్కలేదు. అక్కడనుండి మాయమైయావు నీ చెల్లెళ్ళతో. కాని బుగ్గి అయ్యావు; పతనం అయ్యావు; జీవితపు తలుపులు తెరతీయగా ఆ వాకిలిని ప్రవేశింపలేక ఎడారి పథంలో జీవితాన్ని వమ్ము చేసుకొన్నావు. అవకాశం సద్వినియోగం చేసుకోలేని అధమురాలివి. ఏ భీకర శక్తి నిన్నీ అధోమార్గానికి లాగిందో కాని ఆ నాడు నా మాట వినివుంటే జీవితం ఇంకొక విధంగా ఉండేదేమో!?

అయిందేదో అయిపోయింది. సాంఘిక జీవితంలో నీ బ్రతుకు భ్రష్టమై పోయింది. ఈ విషయం నేను విన్నప్పుడు ఎంత మధనపడ్డానో ఆ పరమాత్ముడికే తెలుసు. ఇలా ఎందుకయ్యావు భాగ్యం? ఏ వెలుగులకోసం శిథిలమయ్యావు నీవు? ఏ భాగ్యంకోసం ఈ దౌర్భాగ్యాన్ని వరించావు? నీ చెల్లెళ్ళైనా గౌరవంగా జీవితాన్ని గడుపుతున్నారా? అప్పుడు పసిపిల్లలు పాపం! నీ జీవితపు మూసలోనే ప్రతిమలయ్యారా?

ఈ భూమి అనంతం. ఇంకా అవకాశాలు పోలేదు. నువ్వు అర్థం చేసుకోగలవు.

ఎంతో ప్రయత్నంమీద నీ విషయం తెలుసుకోగల్గాను. వెంటనే వద్దామనుకున్నాను. కాని మర్యాద కాదనిపించింది. నీ ఉద్దేశ్యం తెలుసుకొందామని ఈ ఉత్తరం. కాబట్టి నన్ను కలుసుకోవాలనే కోరిక ఉంటే పార్కువద్దకు రా. బలవంతం లేదు.

ఇట్లు నీ శ్రేయోభిలాషి,
మోహనరావు.

చదివి కుప్పగా కూలిపోయింది సత్యవతి. కన్నీళ్లు, బాధ, నిస్పృహలో—మనసులో జిలుగు జిలుగుగా గడచిన జీవిత దృశ్యాలు...కష్టాలు, కడగండ్లు, దైన్యాల స్థానంలో...మార్పు. తనకు హాస్టల్ జీవితం, తెలిసీ తెలియని అక్క జీవితం...తన పెండ్లి...

కానీ ఈ నాడు అవమానం...అక్క పథవిహీన.. ఆమె అనుచిత కార్యాన్ని ఎట్లా సమర్థించేది? తెలిసిన తర్వాత ఎలా? నేను అక్కను క్షమించలేను... నేను దూరంగా పోగలను...అక్కముఖం చూడలేను... నాలో అసహ్యాన్ని దాచుకోలేను...ప్రయాణానికి సిద్ధమైంది సత్యవతి.

భారతి, భాగ్యం వచ్చేటప్పటికి ఆలోచనలలో వివశమై కూర్చున్నది సత్యవతి. అప్పుడు భారతి ‘చిన్నక్కా! నీకు అక్క ఎంతమంచి శిల్కుచీరె కొందనుకొన్నావు. చూడక్కా! ఎంత బావుందో!’ అని పార్శిల్ యివ్వబోయిందికాని సత్యవతి ఎంతమాత్రం కుతూహలం ప్రకటించలేదు.

'సత్య! మరదిగారు రాలేదనా ఈ కోపం, చిరాకు?'. భాగ్యం అన్నది.

'అందుకే కోపం, చిరాకు ఉండాలా?' బిరుసుగా అంది సత్యవతి.

'నాకేం తెలుసమ్మా మరి...ఎందు కలా ఉన్నావ్?' బుజ్జగింపుగా అడిగింది.

'ఏమీ జరగలేదు...జరగదు. మేమీ రోజే ప్రయాణమౌతున్నాం...వారి కేదో అర్జంటుగా పని ఉన్నదట...ఇదిగో నీ కివ్వమని ఎవరో ఉత్తరం ఇచ్చారు'. ఉత్తరం అందించింది. అందామనుకొన్న మాటలన్నీ నోటిలోనే ఉండిపోయాయి.

భాగ్యం ఉత్తరం అందుకొని ఇంట్లోకి వెళ్ళింది. సత్యవతికి, భారతికి అక్క ముఖంలో వర్ణింపరాని ఆవేదన కనబడింది. వారిద్దరూ మూగగా, పిచ్చిగా ఒకరిని ఒకరు చూసుకొన్నారు.

అంతలో కృష్ణారావు ఈల వేసుకుంటూ వచ్చాడు. సత్యవతి ముందుకువెళ్ళి 'మనం వెళ్ళిపోదామండి'. ఏడుస్తూ అన్నది.

'ఏమిటి నువ్వంటున్నది'.

'మనం వెళ్ళిపోదాం...ఒక్కనిముషం కూడా ఇక్కడ వుండలేను.'

'అసలేం జరిగింది? ఏమిటీ తొందర?'

'అన్నీ తర్వాత చెబుతాను...ముందు బయలుదేరండి'.

'నీకేమైనా పిచ్చా ఏమిటి? ఇప్పుడు బయలుదేరితే మీ అక్క బాధపడుతుందనే ఆలోచన లేకుండా...ఇంత తొందర పనికిరాదు...'

'అక్క బాధపడటంకాదు; అక్కను గురించే ఇంత బాధ అనుభవించడం...నేను ఇక్కడ ఒక్క క్షణం ఉండలేను...వెళదాం పదండి...లేకపోతే...మీ ఎదుట చచ్చిపోతాను...'

'ఆఁ...' అన్నాడు అమితాశ్చర్యంగా కృష్ణారావు. రెండు నిముషాలు ఆలోచించాడు. ఏమి ఆలోచించాడో ఏమోకాని తాపీగా ఇట్లా అన్నాడు:

'సరే! నీ మాట ప్రకారం వెడదాం...కానీ తర్వాత విచారిస్తే లాభంలేదు. ఆడదాని హృదయం అనుమానాలపుట్ట. కొన్నిసమయాల్లో వారి గురి నిజం కావచ్చు; కాకపోవచ్చు. పోనీ ఆ సంగతెందుకుగానీ ఒకవేళ నీకు బాధ కల్గించే విషయం ఎందుకు జరిగిందో, ఎందుకు జరగవలసివచ్చిందో, దాన్లో నీ ప్రమేయం ఏమన్నా ఉందో లేదో అనేది కూడా ఆలోచించి నిర్ణయానికి రావాలి. అందుకే దెబ్బకన్నా మాట ప్రమాదకరమైంది అంటారు పెద్దలు. కాబట్టి ఇంకోసారి ఆలోచించు. కాదంటావా? ప్రయాణం కట్టు.' సత్యవతి కన్నీరు తుడుచుకొన్నది. సామానులు సర్దింది.

భారతికి అంతా అయోమయంగా ఉంది. ఆ లేత హృదయానికి పూర్తిగా విషయాలు అర్థం కావడం లేదు. ఆమెకు అర్థమైందల్లా ఒక్క కన్నీరు కార్చడమే!

భాగ్యం ఏమీ మాట్లాడలేదు. మాట్లాడడానికి ప్రయత్నించనూలేదు. ఆమె ఆలోచన, అనుభూతులు, మమతలు అన్నీ మూకీభావం వహించాయి.

కృష్ణారావు భాగ్యం గదివద్దకువెళ్ళి 'మేము ఒస్తామండి...అనుకోని విధంగా వెళ్ళవలసి వచ్చినందుకు బాధపడుతున్నాను. మానవులందరూ పరిస్థితులకు బానిసలని మీకు తెలుసు! మీ కర్తవ్యం ఎలా నెరవేర్చారో నా కర్తవ్యం అలానే నెరవేరుస్తున్నాను...వస్తాం' అన్నాడు.

కన్నీరు స్రవిస్తున్న కొద్దీ భాగ్యం గుండె పాషాణమైంది. ఆమె మాట్లాడలేదు.

భారతిని కన్నారా చూసి సత్యవతి బయలుదేరింది. తన హృదయ భారాన్ని తగ్గించుకొని; అక్క హృదయంలో భారం హెచ్చించి, ప్రళయం రగిల్చి కదిలింది. దూరమైపోయారు దంపతులు.

బయట వరండాలో కన్నీటితో భారతి. లోపల, గుండె లోపల భరింపరాని బాధ తొలుస్తూవుండగా నిశ్చేష్టయైన భాగ్యం. ఆమె మనసులాగే చేతిలోని ఉత్తరం ముక్కలు, ముక్కలై ఉంది. కనులలో

నుండి జారిన కన్నీటిలాగే ఆమె మనసులోని ఆలోచనలకు కళ్ళెం పోయింది. ఆవేగంతో ఆమెలోని నరానరాలు వణికినట్లుగా ఆమెలోని వాత్సల్య వీణా తంత్రులు సడలాయి. ఆమె మెదడు పొరల తెరపై గడచిన జీవిత సన్నివేశపు చిత్రాలు మనసు కన్నులకు కనబడుతున్నాయి.

...తల్లిదండ్రులులేక అనాథయై చెల్లెళ్లతో అష్టకష్టాలుపడటం, ఎందరో మనుష్యులు తనను కామించడం, వారి పాశవిక శక్తులనుండి ఎలాగో బయటపడటం...

...ఒక వర్షంరోజు...తడిసిపోయిన పూరింట్లో కామపు పొరలలో ప్రేమించినట్లు నటించే రకరకాల రుచులు మరగిన మోహనరావు తెచ్చిపెట్టుకొన్న పరివేదన...అతని మాటల్లో చెల్లెళ్లను గురించిన ప్రసక్తి ఏమాత్రం లేకపోవడం కారణంగా అక్కడ నుండి మాయమై లోకంమీద పడడం...

...బతుకుతెరువుకోసం, ఏ పనిచేసినప్పటికీ అజమాయిషీచేసే వాళ్ల కళ్లలో కోరలు విప్పిన కామాన్నిచూసి, దానితోబాటు తనలో రగుల్కొంటున్న అర్థంకాని తపనకు దాసోహం, జీవన పోరాటాన్ని ఎదుర్కోడానికి జీవితం మారురూపు ధరించడం.

కాని తన భ్రష్ట జీవితానికి దూరంగా చెల్లెళ్ళకు ఉన్నత సంస్కారం అబ్బేటట్లు ఏర్పాటు చేయడం...తాను పతనమైనా వారి అభివృద్ధికోరి వారే తన రెండు కన్నులల్లాగా అనుకొని తనఉనికి మాత్రం అతి రహస్యంగా ఉంచటం...

...సత్యవతి పెండ్లి ప్రయత్నం...మళ్లా సమస్యలు...తననే పెండ్లిచేసుకోడానికి సిద్ధమైన కృష్ణారావుకు తాను టి. బి. పేషెంటుననిచెప్పి, ఆ విధంగా నటించి, సత్యవతి పెండ్లిచేసి సగంభారం వదిలించుకొని తృప్తిపడటం...

...తర్వాత బ్రదుకుమీద అసహ్యంతో తనకు తానే సంస్కరించుకొని సరిక్రొత్త జీవితాన్ని సాగించడం...ఇంతకాలానికి మోహనరావు అక్కసుతో అసూయతో, అతిశయోక్తులతో వ్రాసిన ఉత్తరం సత్యవతి చేతుల్లో పడడం...గోప్యమైన తన విషయం బయటపడటం...

...సత్యవతి...ఒక్క సానుభూతివాక్యంలేకుండా...తానేపరిస్థితుల్లో అట్లా ప్రవర్తింపవలసివచ్చిందో తెలుసుకోకుండా, కనీసం పెంచిన మమకారాన్ని లక్ష్యం చేయకుండా, పైపెచ్చు కర్కశంగా మాట్లాడి...భర్తతో వెళ్లిపోవడం...మొదలైన విషమఘట్టాలు భాగ్యం మనసులో.

ఆమె హృదయం వాదోపవాదాల సంగ్రామ రంగం అయింది.

—నా జీవితాన్ని వమ్ముచేసుకొని నా రెండు కన్నులవంటి చెల్లెళ్ళ సుఖం కాంక్షించాను. ఒకదానికి పెండ్లిచేశాను. ఇప్పుడు నా కథ వెల్లడైంది. దానికి ఆలోచన, సానుభూతి, వివేకం లేకుండా నన్ను కేవలం కులటగా ఎంచుకొని నా మనసును క్షోభపెట్టి పోయింది. నేను కోరింది దాని సుఖం, క్షేమం మాత్రమేనని, అదే నా జీవితానికి సంతృప్తిఅనే సంగతి అది ఆలోచించలేదు. కానీ...ఇప్పుడు నా ఆశాతంతువు తెగింది. నా జీవిత లక్ష్యమే ధ్వంసమయింది. సత్యవతి...హాఁ...అభిమానురాలు...నన్నవమానించి, తన్నవమానించుకొంది......ఏమైనా నా ఒక కన్ను పోయింది...ఏంచేయాలి నేను?

ఇప్పుడు...ఇక మిగిలింది...ఇంకొక్క కన్ను...భారతి...పసిపిల్ల...ఇది నన్ను గౌరవిస్తుందా?...నమ్మకం ఏమిటి? దాని చెల్లెలు ఇది! పెండ్లిచేసి సంసారపక్షంగా ఉంచినప్పటికీ అది చీమంత గౌరవం చూపలేదు; కృతజ్ఞత ... కాదు. ఒక్క సానుభూతి వాక్యమైనా పలకలేదు. ఇదిమాత్రం ఇస్తుందా? ఏమో! మనసుల్ని ఎవరు చదువగలరు? ఇది దానిలా చేస్తే నా జీవితం ఏంకాను? రెండు కన్నులు పోతే ప్రాణం ఏంచేసుకోను? ఇక ఏ వెలుగు నా నిస్సారమైన అంధజీవితానికి ప్రకాశం ఇస్తుంది? లోకంలో నా మనుగడకు అర్థమేమిటి? నా ఉనికికి సార్థకత ఏమిటి??

నా జీవితాన్ని సంస్కరించుకొన్నాను ప్రస్తుతం.. ఇప్పటికే కొంత బయటపడిన నా చరిత్ర ఎప్పుడో ఒకప్పుడు స్పష్టంగా తెలియక తప్పదు. అప్పుడు దీనికి ఇప్పటి ప్రేమ, వాత్సల్యం, ఆదరణ ఉంటాయా? దీని అక్క ఆలోచించలేదే ఒక్కక్షణం

అయినా నన్నుగురించి. ఇది మాత్రం? కాబట్టి... కాబట్టి...దీన్నికూడ...నాలాగే...తయారుచేస్తే!!?... ఈ మాట అనుకోగానే నవనాడులు అవిసిపోయాయి. క్షణంసేపు గుండెలో రక్తం స్తంభించింది. శరీరం గగుర్పొడిచింది. ఇంత పతనమా? ఇంత అమానుషమా? అని మనసు ఘోషించినా కసివల్ల అంతరాత్మ ఆవేదనకు జోలపాడింది. అది స్వార్థమో! అవివారమో! గత్యంతరం లేకపోవడమో! ఒకవిధమైన సంతృప్తి!

వెంటనే భాగ్యం గుండెలో ఏదో శక్తి విజృంభించింది. ఆలోచనలకు మబ్బుపట్టింది. 'భారతీ!' కఠినంగా పిలుద్దామనుకొని పిలిచింది. అంత కాఠిన్యం లేదనుకొన్నదో ఏమో 'భారతీ! లోపలకు రా. అలంకరించుకో...' సాధ్యమైనంత క్రూరత్వం తెచ్చిపెట్టుకొని తలుపు తెరచింది. హృదయ కుహరంలో ఒక మూలనుండి మాత్రమే ధ్వనించిన ఆక్రందన అది. ఆమె గొంతు ఆమెకే క్రొత్తగా ఉన్నది.

అక్క ఎదుట ఎన్నడూ ఏడ్వని భారతి వచ్చి కన్నీళ్ళతో ఎదురుగా నిలబడివున్నది. ఉగ్రురాలైన తల్లిని చూసి భయపడిన పసిపిల్లలాగూ ఉన్నది; రాక్షసుని చూసి గుండె పగిలిన ప్రాణిలాగూ ఉన్నది. భారతికి విషయం అర్థమైనట్లుంది. అందుకు కన్నీరుతో నిండిన కన్నులు సాక్ష్యం.

'భారతీ!' అదలించింది భాగ్యం. 'అక్కా!' అని భారతి అక్కను వాటేసుకొన్నది. భారతి కన్నీరు భాగ్యం చెంపల్ని, భుజాల్ని తడిపాయి. భారతి అమాయకపు కన్నీరు భాగ్యం గుండెలోని క్రోధాన్ని ఉపశమింపజేసింది. ఆమె మనసులో అనురాగపు మెరుపులు, వాత్సల్య ప్రవాహాలు...హృదయంలో కోపపు మురికి పోగా ఇనుమడించిన మమతాకాంతి! భారతి మూగ కన్నీరు భాగ్యం ఉద్దేశాన్నే క్షాళితం చేసిందో? మరల్చుకోలేని మమత జ్ఞానోపదేశం చేసిందో? అగాధంలో పడబోయే జీవికి ఆశాపాశమే దొరికిందో!?

మారిన భాగ్యం మనసు మాఱింది! భాగ్యం మనిషే! తాను నాశనం అయినా తమ సంతతి సురక్షితంగా ఉండాలని కాంక్షించే చెట్టుచేమా, పుట్టా పురుగుకన్నా, జంతువులకన్నా భాగ్యం క్షుద్రజీవికాదు.

'అమ్మా! భారతీ! నిన్ను నాలా నాశనం చేయను తల్లీ! నువ్వు నా ప్రాణంలో ప్రాణానివి... నా చూపులో చూపువి...నువ్వు బాగా...చదువుకొని... హాయిగా...ఆనందంగా జీవితం గడపాలి...మనం... ఎక్కడికన్నా...దూ...రంగా...వెళ్ళిపోదాం...నన్ను... క్షమించు...అమ్మా...' అని పిచ్చిగా, గోముగా, ఆవేశంతో భారతి ముఖాన్ని ముద్దులతో నింపింది.

'అక్కా!'అని భాగ్యం పాదాలపై పడిపోయింది. భాగ్యం నిర్మలమైన కన్నీరు భారతి తలను అభిషేకం చేసింది.

వారి రెండు హృదయాల స్పందనం మినహా ఆ గదంతా మూగ నిశ్శబ్దంతో తపస్సు చేసింది.